క్లుప్తంగా

22న క్రైస్తవ పాటల పోటీలు

చిలకలూరిపేట: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవ పాటల పోటీలు ఈ నెల 22 తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు అందెల శౌరి తెలిపారు. పోటీలు పట్టణంలోని అర్బన్ పోలీసు స్టేషన్ పక్కన ఉన్న అంబేద్కర్ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. పోటీలలో స్త్రీలు, పురుషులు పాల్గొనవచ్చన్నారు. మొదటి బహుమతి కింద రూ. 5 వేలు, మెమొంటో, ద్వితీయ బహుమతి కింద రూ. 3 వేలు, మెమొంటో, తృతీయ బహుమతి కింద రూ. 2 వేలు మెమొంటో, మూడు కన్సోలేషన్ బహుమతులుగా రూ.వెయ్యి, మెమొంటో బహూకరించబడతాయన్నారు. ఇంకా ప్రత్యేక బహుమతులు ఉంటాయని, రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ. 100 చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9951197170, 8886169942 నంబర్లను సంప్రదించాలన్నారు.

చిన్నారులకు అన్నదానం

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో ఉన్న మానసిక వికలాంగుల పాఠశాలలోని చిన్నారులకు వినుకొండ మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ సంద్రపాటి సైదా, వారి బంధువులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్‌వలి, కంట్రగుంట్ల మాలిక్, కొబ్బరిబోండం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో సెమీ క్రిస్మస్ వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.వెంకట రమణమ్మ, చైర్మన్ గాలిదిన్నె కోటేశ్వరరావు, సర్పంచ్ కె.బెన్నెయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సింగం శ్రీనివాసరెడ్డి, పి.పిచ్చయ్య, ఎం.రామకృష్ణారెడ్డి, జె.నాగరాజు, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం. నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పెద్ద మసీదు బజారుకు చెందిన షేక్ మొహమ్మద్ గత కొన్ని నెలలుగా పక్షవాతంతో బాధపడుతున్న విషయాన్ని సంకల్ప సేవా సమితి సభ్యులు తెలుసుకొని సమితి తరపున బియ్యం, నిత్యావసర వస్తువులను, కూరగాయలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జానీ మాట్లాడుతూ కాంట్రాక్ట్ షేక్ నాగూర్‌బాషా సహకారంతో బాధితుడికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసినట్లు తెలిపారు.

చౌక్‌బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక

చిలకలూరిపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ చౌక్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల జట్లను శనివారం ఎంపిక చేసినట్లు అసోసియేషన్ చైర్మన్ చేబ్రోలు మహేష్ చెప్పారు. పట్టణంలోని గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 116 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వారి ఉత్తమ ప్రతిభ కనపరిచిన 15 మంది బాలికల జట్టు, 15 మంది బాలుర జట్టును ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరు వచ్చే ఏడాది ఫిబ్రవరి 23 పంజాబ్‌లోని జలంధర్‌లో జరగనున్న జాతీయస్థాయి టోర్నమెంటుకు ఆంధ్రరాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని చెప్పారు. ఈ ఎంపికలను అసోసియేషన్ సెక్రటరీ సుధాకరరావు, జిల్లా సెక్రటరీ ఫిలిఫ్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ తదితరులు పర్యవేక్షించారు.

ఉచిత ఆయుష్ వైద్యశిబిరం



వినుకొండ(నూజెండ్ల): ప్రతిదినం-ప్రతి ఇంటా ఆయుర్వేదం అనే కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఆయుష్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రంగారావు, రాజకుమారి, వీరస్వామి, పానకాలరెడ్డి, హారిక, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు ఆయుష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బెల్లంకొండ: శీతాకాలం సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు కె.వి కోటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక వైద్యశాలలో సీజనల్ వ్యాధులపై రోగులకు అవగాహణ కల్పించారు. ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమ కాటు ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా, స్వైన్‌ఫ్లూ తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మందులు పంపిణీ చేశారు.

ప్రతిపక్షాన్ని దీటుగా ఎదుర్కొంటాం



మాట్లాడుతున్న సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

- సీఎం వైఎస్ జగన్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- ముఖ్య నాయకుల సమావేశంలో సమన్వయకర్త రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎవరు పోటీ చేసినా వైఎస్సార్ సీపీ నుంచి తాను దీటుగా ఎదుర్కొంటానని... నియోజకవర్గంపై పార్టీ జెండా రెపరెపలాడించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులతో పట్టణంలోని ఫంక్షన్ హాలులో శనివారం సమావేశం నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రాజేష్ నాయుడు మాట్లాడుతూ రాజకీయాల్లోకి తాను కొత్తగా రాలేదని వెల్లడించారు. తన తండ్రి మల్లెల సత్యనారాయణ మున్సిపల్ కౌన్సిలర్‌గా అత్యధిక మెజార్టీతో గెలవడంతో పాటు దివంగత మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య ముఖ్య అనుచరుడిగా వ్యవహరించేవారని చెప్పారు. తాను ఇక్కడే పుట్టి పెరిగానని, ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఒక హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేసి 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని, ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రభుత్వం మారితే రాష్ట్రానికి మంచిది కాదన్నారు.

టీడీపీ అరాచకాలు తెలియజేయాలి

మాజీ మంత్రి ప్రత్తిపాటి ఓడిపోయాక ఏనాడైనా ప్రజల్లోకి వచ్చాడా అని ప్రశ్నించారు. మూడు సంవత్సరాల పాటు ఆయనను నమ్ముకున్న వారిని కూడా పలకరించిన పాపాన పోలేదని విమర్శించారు. కరోనా కష్టకాలంలో అందరినీ వదిలివేసి, కుటుంబంతో హైదరాబాద్ వెళ్లి దాక్కున్న సంగతి ప్రజలు మరిచిపోయారని తెలిపారు. నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్ రావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఎంపీపీలు దేవినేని శంకరరావు, పిడతల ఝాన్సీసాగర్, తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యులు కోడే సుధారాణి, ముక్తా శ్రీనివాసు, పార్టీ మండలాల అధ్యక్షులు పఠాన్ తలహాఖాన్, గుత్తా యాములయ్య, గంటా శంకర్, మద్దూరి కోటిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కుటుంబాలకు పనిచేసే అవకాశం కల్పించాలి

మున్సిపల్ మేనేజర్‌కు కార్మికుల వినతి

నరసరావుపేట: చనిపోయిన మున్సిపల్ కార్మికుల కుటుంబ సభ్యులకు పనిచేసే అవకాశం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రదర్శన చేసి మేనేజర్‌కు విన్నపాలను తెలియ చేశారు. చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఉండట్లేదని, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదుకాక ముందు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, చనిపోయిన కార్మికులకు ఇవ్వాల్సిన పీఎఫ్ బకాయిలు ఇప్పించాలని, కార్మికులు అందరికీ ఈఎస్ఐ కార్డులు ఇప్పించాలని కోరారు. గత రెండేళ్ల నుంచి కార్మికులకు ఇవ్వాల్సిన కొబ్బరినూనె, సబ్బులు, గ్లౌజులు ఇవ్వట్లేదని, వాటిని ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.మల్లయ్య, డి.యోహాను, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి బాలిక కౌమారదశ విద్య గురించి తెలుసుకోవాలి

- డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని
- ముగిసిన కౌమారదశ విద్య శిక్షణ తరగతులు



శిక్షణ కార్యక్రమంలో హాజరైన ఉపాధ్యాయులు

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం జిల్లా విద్యాశిక్షణ సంస్థలో కౌమారదశ విద్యపై రెండు రోజుల పాటు కొనసాగిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎం సుభాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు శనివారం పల్నాడు జిల్లాలోని ఎంపిక చేసిన 68 ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. బాలికల్లో వయసు రీత్యా కౌమార దశలో వచ్చే మార్పులు, తదనుగుణంగా వారిలో ఏర్పడే అపోహలు తొలగించడం వంటి విషయాలపై రీసోర్స్ పర్సన్లకు శాస్త్రీయపరంగా శిక్షణ అందించారు. ఆయా శిక్షణ అంశాల్ని తమ పాఠశాలల్లోని బాలికలకు తెలియజేసి కౌమార విద్యపై అవగాహన కల్పించాలని కోరారు. రెండు రోజులు శిక్షణ తరగతుల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఎంపిక చేసిన 135 పాఠశాలల్లోని రీసోర్సు పర్సన్లకు ఇచ్చినట్లు చెప్పారు. ఈ శిక్షణలో కార్యక్రమంలో డాక్టర్ కె ప్రసాద్, కె.యోగేశ్వరరావు పాల్గొన్నారు.

ఖాళీ స్థలంలో క్రిస్టియన్‌పాలెం వాసుల గుడిసెలు

- వ్యతిరేకించిన టీడీపీ నాయకుడు అరవిందబాబు
- ఖండించిన స్థానికులు



టీడీపీ నాయకుడు అరవిందబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న క్రిస్టియన్‌పాలెం వాసులు

నరసరావుపేట: స్థానిక ఐదో వార్డు క్రిస్టియన్ పాలెంలో సొంత ఇళ్లులేని నిరుపేదలు కొంతమంది సమీపంలోని వాగు పోరంబోకు భూమిలో గుడిసెలు వేశారు. ఆ స్థలం మాది అంటూ కొంతమంది వ్యక్తులు ఆ గుడిసెలను కూల్చివేశారు. దీనికి వైఎస్సార్‌సీపీ వారే కారణమని, ఆ భూమికి ఫెన్సింగ్ వేయించాలంటూ టీడీపీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై ఆరోపణలు చేశారు. ఇది తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వర్గీయులు మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా నాయకత్వంలో మాదిగ వర్గీయులు అరవిందబాబు చర్యలను ఖండిస్తూ ప్రదర్శన చేశారు. గత 60 ఏళ్ల నుంచి తమకు సొంత ఇళ్లులేక అద్దె ఇళ్లల్లో ఉంటూ నానా ఇబ్బంది పడుతున్నామని, ఖాళీగా ఉన్న స్థలాన్ని ఎక్కడి నుంచో వచ్చిన వ్యక్తులు ఆక్రమించుకుంటుంటే చూస్తూ ఊరుకోలేక తామే కుటుంబానికి ఒక సెంటు చొప్పున కేటాయించుకుని గుడిసెలు వేసుకుంటున్నామని వెల్లడించారు. దీనికి ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, దీనిపై ఎటువంటి రాజకీయాలు చేయవద్దని అరవిందబాబుకు సూచించారు.

క్రీడల్లో పోటీ తత్వాన్ని ప్రదర్శించాలి

సత్తెనపల్లి అర్బన్ సీఐ ప్రభాకర్ రావు



మాట్లాడుతున్న సీఐ ప్రభాకరరావు

సత్తెనపల్లి: క్రీడాకారులు క్రీడల్లో పోటీ తత్వాన్ని ప్రదర్శించాలని సత్తెనపల్లి అర్బన్ సీఐ పి. ప్రభాకరరావు అన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వావిలాల గోపాలకృష్ణయ్య ఇండోర్ స్టేడియంలో శనివారం బ్యాడ్మింటన్ పవర్ గేమ్ టోర్నమెంట్ నిర్వహించారు. సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని, టోర్నమెంటును ప్రారంభించారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ వై.రాఘవరెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఈ టోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫ్రెండ్లీ టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు డాక్టర్ జి.శ్రీధర్, చందు, రవి, సుబ్బయ్య, బాబావలి, ఎం.ఏడుకొండలు, రమేష్, మధు, వెంకట్, తిరుపతిరావు, కిరణ్, జగదీష్, భాష, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో నరసింహారావు

పెదకూరపాడు: యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను మండల విద్యాశాఖాధికారి రావిపాటి నరసింహరావు శనివారం అచ్చంపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టడీమెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఆళ్లమూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ప్రతి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా వీటిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్ బాషా, శౌరెడ్డి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, వాసవి, మరియమ్మ, మస్తాన్ వలి పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహా సభలను జయప్రదం చేయండి

ఈ నెల 26న గురజాలలోని చల్లగుండ్ల గార్డెన్‌లో జరిగే యూటీఎఫ్ మహాసభలను జయప్రదంచేయాలని యూటీఎఫ్ నాయకులు శనివారం కోరారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: మండలంలోని గణపవరం గ్రామంలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఆశాఖ ఏఈ ప్రసాద్ తెలిపారు. గణపవరంలోని 11కెవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టడంతో గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాటుసారా కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమంగా నాటుసారా కలిగిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శనివారం తెలిపారు. నకరికల్లు మండలం చాగల్లు గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా నాటుసారా కలిగి ఉన్న కుంబా శ్రీనివాసరావు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మైనింగ్ నిలిపివేత



రొంపిచర్ల: మండలంలోని అన్నవరం రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ భూమిలో అక్రమంగా మైనింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.అంకారావు శనివారం తెలిపారు. ఈ మేరకు హెచ్చరిక జారీ చేస్తూ ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అక్రమ మైనింగ్ చట్టరీత్యా నేరమన్నారు. అతిక్రమించి మైనింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రేపు ఆలయ పునర్ నిర్మాణానికి శంకుస్థాపన

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఈనెల 18వ తేదీ ఉదయం 9.25 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డి శనివారం తెలిపారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖామాత్యులు కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీని వాసరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని వివరించారు. అలాగే ఆలయ నూతన పాలక మండలి అభినందనసభ జరుగుతుందని తెలిపారు.

సేంద్రియ పంటల పరిశీలన

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో నిర్వహిస్తున్న న్యూట్రి గార్డెన్‌లను సేంద్రియ వ్యవసాయ సత్తెనపల్లి డివిజన్ ఇన్‌చార్జి మధుబాబు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు, నూతన సాంకేతిక పద్ధతులను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవ సాయ పంటల ఏటీఎంలను పరిశీలించారు ఎటువంటి పురుగు మందులు, రసాయన అవశేషాలు లేని కూరగాయాలు, పండ్లు, పంటలకు ప్రపంచ స్థాయి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. ఈ సందర్భంగా న్యూట్రిగార్డెన్‌లను, పంటల ఏటీఎంలను నిర్వహించే మహిళలతో ఆయన మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. మండల సమైక్య ప్రెసిడెంట్ జి.కుమారి, సీసీ బ్రహ్మం, ఎన్ఎఫ్ఎఎస్ నందకుమార్, సైదయ్య, యూనిట్ ఇన్‌చార్జ్ శ్రీదేవి, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

గురజాలలో మొసలి కలకలం

గురజాల : నగర పంచాయతీలోని లక్ష్మీటాకీస్ సెంటర్‌లో మొసలి కలకలం రేపింది. హద్దుల కుంట వద్ద శుక్రవారం రాత్రి మొసలి కుంట ఒడ్డున సేద తీరుతున్న సమయంలో కంట పడటంతో సమీపంలోని ఇంటి యజమాని భయంతో కేకలు వేశాడు. స్థానికులు వచ్చి చూడగా మొసలి అక్కడి నుంచి కుంటలోకి జారుకుంది. కుంటకు సమీపంలో నివాస ప్రాంతాలు, పశువుల పాకలు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కుంటలో మొసలి ఉన్నట్లు గుర్తించారు. స్థానికులు జాగ్రత్తగా ఉండాలని త్వరలో మొసలిని పట్టుకుంటామని తెలిపారు.

లక్ష్య సాధన దిశగా విధులు నిర్వర్తించాలి

జేసీ శ్యాంప్రసాద్



మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

నాదెండ్ల: ప్రభుత్వ పథకాలు ఏవైనా అర్హులైన లబ్ధిదారులకు అందినపుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ చెప్పారు. మండలంలోని జంగాలపల్లి గ్రామంలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి శనివారం హాజరయ్యారు. కార్యక్రమానికి సర్పంచ్ తిరుమల రెడ్డి ఉషారాణి అధ్యక్షత వహించారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరించారు. 17 సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. పథకాలను అర్హులైన లబ్ధిదారుల దరి చేర్చేందుకు స్థానిక అధికారులు కృషి చేయాలన్నారు. పొలాలకు మందులు పిచికారీ చేసే డ్రోన్ స్ప్రేయర్‌ను ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో యంత్రాన్ని అందిస్తున్నదన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సంకురాత్రిపాడు గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జెట్టి నాగమణి, తహసీల్దార్ ఎన్. నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, పీహెచ్‌సీ వైద్యాధికారి, ఏవో హరిప్రసాద్, సీడీపీవో శాంతకుమారి, పార్టీ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఆలా శివకోటి, సాయికిరణ్ రెడ్డి, జెట్టి బొల్లయ్య, పత్తి వెంకట్, తిరుమలరెడ్డి లూర్దురెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు ఆర్థిక సహాయం



అగ్ని ప్రమాద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేస్తున్న దృశ్యం

రొంపిచర్ల: స్థానిక తూర్పు బజారులో గత నెల 6న అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన పూర్వ విద్యార్థులకు శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. అగ్ని ప్రమాద బాధితులైన పూర్వ విద్యార్థులు పంబా పుల్లాదాసు, పంబా మల్లికార్జున కుటుంబాలకు 16 వేల రూపాయలు విలువ గల బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన పూర్వ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పూర్వ విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం వారికి బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు సైదయ్య, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు పంబా వెంకట్, మందుల రవికుమార్, పిడెం హుస్సేన్, సరికొండ తిమ్మరాజు, పేరుబోయిన నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాలు ఢీకొని ఇద్దరి మృతి



మృతిచెందిన బీర్నీడి రాంబాబు



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రవీంద్ర

వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన వినుకొండలో శనివారం జరిగింది. ఏబీఎం కాంపౌండ్‌కు చెందిన బీర్నీడి రాంబాబు (45) తన మిత్రుడు మస్తాన్‌వలి బైక్‌పై పట్టణంలోకి వస్తుండగా వెంకటేశ్వర సినిమా హాల్ వద్ద నరసరావుపేట నుంచి వినుకొండకు వస్తున్న పల్లెవెలుగు బస్సు వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందగా మస్తాన్‌వలికి తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. మస్తాన్‌వలిని వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య సురేఖ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని మరొకరు..

రొంపిచర్ల : వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు దాటుతున్న బైక్ ను ఢీకొన్న సంఘటన హైవే రోడ్డు పరిధిలో గల స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో బైక్ మీద ఉన్న ఇరువురు వ్యక్తులలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో వడ్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన బోడె భ్రమరాంబ (67), గానుగపంట వెంకటేశ్వరరెడ్డి రొంపిచర్ల నుంచి తమ స్వగ్రామానికి బైక్ మీద బయలుదేరారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో గల నార్కెట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి ఒంగోలు వైపునకు వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి వీరి బైక్‌ను ఢీకొన్నది. ఈ సంఘటనలో బైక్ రోడ్డు పక్కన గల పొలాల్లోకి దూసుకుపోయి తిరగపడటంతో వారి ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.పి. రవీంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని వారిని చికిత్స నిమిత్తం నరసరావు పేటలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ బోడె భ్రమరాంబ మృతి చెందారు. అయితే తీవ్ర గాయాలైన గానుగపంట వెంకటేశ్వర రెడ్డి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రమాదానికి కారణమైన కారును, కారు డ్రైవర్ గోరంట్ల ప్రదీప్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

రామోజీ.. తప్పుడు కథనాలు రాయడం మానుకో!

నంగారాభేరి సేవాలాల్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణానాయక్



వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఈనాడు దినపత్రికలో రామోజీరావు ప్రచురించిన అసత్యకథనాలను నంగారాభేరి సేవాలాల్ రాష్ట్ర అధ్యక్షులు రమావత్ కృష్ణానాయక్ ఖండించారు. పట్టణంలోని సేవాలాల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కృష్ణానాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇచ్చే ట్యాబ్‌ల గురించి ఈనాడు దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన తప్పుడు కథనాలను ఖండించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం 4.50 లక్షల మందికి గతంలో ట్యాబ్‌లను పంపిణీ చేసిందని, మరలా మరోమారు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఇలాంటి కథనాలు బాధాకరమన్నారు. పేద విద్యార్థుల అభివృద్ధిని జీర్ణించుకోలేకనే ఇలాంటి కథనాలు రాస్తున్నారని విమర్శించారు. రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణలు చంద్రబాబుకు రాజకీయ లబ్ధి కోసమే ఇలాంటి కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ప్రజలు వాస్తవాలు తెలుసుకుని సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భూక్యా కాంతానాయక్, రమావత్ గోవిందునాయక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం

మాట నిలుపుకున్న మంత్రి అంబటి



సత్తెనపల్లి: రజకులకు ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని గతంలో ఇచ్చిన హామీని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నెరవేర్చారు. శనివారం రూ.3 లక్షల విరాళం నాయకుల ద్వారా అందించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు గని, వల్లెం నరసింహారావు సమక్షంలో నగదును రజక సంఘ నాయకులు సత్తెనపల్లి బసవయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు చామర్తి ఆంజనేయులు (చిన్నా), బేబ్బులి, ఉల్లంగుల ప్రసాదుబాబు, మందడపు సాయి, దర్శనాల తిరుపతి రావు, సాంబయ్య, కొండా, కురిచేటి నాసరయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



సత్తెనపల్లి: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ ఎస్ఎస్ కుమార్ అన్నారు. డిపో పరిధిలోని అమరావతి, అచ్చంపేట రూట్లో లక్కీ డిప్ ద్వారా ప్రయాణికులకు బహుమతులను శనివారం అందించారు. సత్తెనపల్లి - అచ్చంపేట రూట్‌లో క్రోసూరుకు చెందిన ప్రయాణికులు నర్సింహ, ఎస్.కావ్య సత్యశ్రీ, సత్తెనపల్లి-అమరావతి రూట్ లో వైకుంఠపురానికి చెందిన అప్పారావు, అమరావతికి చెందిన ఇ.భవాని బహుమతులను కైవసం చేసుకున్నారన్నారు. ఈ లక్కీ డిప్ నెలలో రెండుసార్లు తీయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులున్నారు.